

పదోతరగతి తర్వాత!

# ఉద్యోగ ధీమానిచ్చే వ్యవసాయ డిప్లొమా!

**వ్యవసాయం, దాని అనుబంధ రంగాలే వెన్నెముకగా ఉన్న మన దేశానికి క్షేత్రస్థాయిలో నిపుణుల అవసరం ఎంతో ఉంది. గ్రామీణ విద్యార్థుల్లో వ్యవసాయ సంబంధమైన విజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు స్వయం ఉపాధి, ఇతర ఉద్యోగావకాశాలను విస్తృతం చేసే లక్ష్యంతో కొన్ని ప్రత్యేక పాలిటెక్నిక్ కోర్సులను యూనివర్సిటీలు అందిస్తున్నాయి. సంప్రదాయ చదువులకు భిన్నంగా వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాస్త్ర, ఉద్యాన విభాగాల్లో ఇస్తున్న ఈ డిప్లొమాలు గ్రామీణ యువతకు ఉపాధి భరోసానిస్తున్నాయి.**

గ్రామీణ ప్రాంత యువతీయువకులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వ్యవసాయం, పశుసంర్ధక, మత్స్యశాస్త్ర, ఉద్యాన విభాగాల్లో ఈ కోర్సులను రూపొందించారు. మత్స్యశాస్త్రం మినహా మిగతా వాటిలో ప్రైవేటు పాలిటెక్నిక్‌లు కూడా ఉన్నాయి.

వ్యవసాయం, పశుపోషణ, ఉద్యాన, మత్స్యశాస్త్రాల్లో నిపుణుల కొరత ఎక్కువగా ఉంది. సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా శాస్త్రీయంగా ఆయా రంగాల్లో సూచనలు సలహాలు ఇచ్చేవారు కరవయ్యారు. ఉన్నత విద్యావంతులు, శాస్త్రవేత్తలు జిల్లా, మండల కేంద్రాలకే పరిమితమయ్యారు. వ్యవసాయం, ఉద్యాన, మత్స్య, పశుపోషణపై ఆసక్తి ఉన్న యువతకు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ కోర్సులను రూపకల్పన చేశారు. వీటికి డిమాండ్ బాగా పెరిగింది. రైతులకు అండగా నిలిచే లక్ష్యంతో కరిక్యులమ్ తయారుచేసి తెలుగు మాధ్యమంలో బోధిస్తున్నారు.

## పదోతరగతి, గ్రామీణ నేపథ్యం

ఒకటి నుంచి పదోతరగతి మధ్య కనీసం నాలుగు సంవత్సరాలైనా నగరపాలిక, పురపాలికేతర ప్రాంతాల్లో అంటే గ్రామాల్లో చదివిన వారు మాత్రమే ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి. పదోతరగతి లేదా తత్సమాన సర్టిఫికెట్ కనీస విద్యార్హత. ఇంటర్ మొదటి లేదా రెండో సంవత్సరం చదువుతున్న వారూ, పదోతరగతి కంపార్టుమెంట్‌లో ఉత్తీర్ణులైన వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు, ఆపై అర్హతలు ఉన్నవారు కోర్సు దరఖాస్తుకు అనర్హులు. వయసు 15-22 సంవత్సరాలు. ఎలాంటి రాతపరీక్ష లేదు. పదోతరగతి మార్కుల ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. రాష్ట్రస్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లను భర్తీ చేస్తారు.

## ఉద్యోగావకాశాలు

వ్యవసాయంలో డిప్లొమా పూర్తిచేసిన వారికి వ్యవసాయశాఖలో ఏఈవో, ఎంపీఈవోలతోపాటు ప్రైవేటు విత్తన, ఎరువుల సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. పురుగుల మందులు, ఎరువుల విక్రయించే దుకాణ అనుమతులకు వ్యవసాయ డిప్లొమా తప్పనిసరి అనే నిబంధనను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పశుసంవర్ధక పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసినవారికి పశుసంవర్ధకశాఖలో ఎంపీఈవోలుగా, పశువైద్య సహాయకులుగా ఉద్యోగాలు లభిస్తాయి. కోళ్ల పరిశ్రమ, దాణా తయారీ కర్మాగారాల్లోనూ ఉపాధి సాధించుకోవచ్చు. డెయిరీ ప్రాసెసింగ్ డిప్లొమా పూర్తి చేసినవారు ప్రైవేటు డెయిరీ కర్మాగారాల్లో నిపుణులుగా చేరవచ్చు. ఉద్యాన పాలిటెక్నిక్ పూర్తిచేసిన వారికి ఉద్యానశాఖలో ఏహెచ్‌వో, ఎంపీఈవోలుగా, ప్రైవేటు విత్తన సంస్థలు, ప్రైవేటు నర్సరీల్లో కొలువులు దొరుకుతాయి.

## ఉన్నత విద్య

రెండేళ్ల ఈ డిప్లొమా కోర్సును ఇంటర్‌తో సమానంగా పరిగణించరు. అయితే వీరికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు నిర్వహించే అగ్రిసెట్, హార్టీసెట్ ద్వారా నేరుగా బీఎస్సీ (వ్యవసాయం) బీఎస్సీ (ఉద్యానం) కోర్సుల్లో ప్రవేశించేందుకు అవకాశం ఉంది. ఆ సెట్లలో డిప్లొమా విద్యార్థులకు ఎంసెట్‌తో సంబంధం లేకుండా మొత్తం సీట్లలో 20 శాతం సీట్లు కేటాయించి భర్తీ చేస్తారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డిగ్రీ అడ్మిషన్ల కోసం అగ్రిసెట్ ప్రకటన వెలువరించింది. జూన్ 25 వరకు దరఖాస్తులు పంపవచ్చు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం కూడా డిగ్రీ ప్రవేశాల కోసం హార్టీసెట్ ప్రకటన విడుదల చేసింది. జూన్ 18 వరకు దరఖాస్తులు పంపవచ్చు.

పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ ప్రాసెసింగ్ డిప్లొమా విద్యార్థులకు ఈ వెసులుబాటు లేదు. పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ ప్రాసెసింగ్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులను బీవీఎస్సీ (పశుసంవర్ధకం), బీటెక్ (డెయిరీ టెక్నాలజీ), బీఎఫ్ఎస్సీ కోర్సులకు అనుమతించరు. మళ్లీ ఇంటర్మీడియట్ చదివి ఎంసెట్‌లో ర్యాంకులు సాధిస్తేనే వీరికి ఉన్నత విద్యావకాశాలు ఉంటాయి.

*- పసుపులేటి వేణుగోపాల్,* న్యూస్‌టుడే-తిరుపతి

### తెలంగాణలో!

**పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం:** తెలంగాణ రాష్ట్రంలోని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో కరీంనగర్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, మామ్‌నూర్‌లో నాలుగు పశుసంవర్ధక పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. ప్రతి కేంద్రంలో 20 డిప్లొమా ఇన్ యానిమల్ హజ్‌బెండ్రి సీట్లు ఉన్నాయి. పశుసంవర్ధకశాఖలో ప్రైవేటు పాలిటెక్నిక్‌లు తెలంగాణలో లేవు. **వెబ్‌సైట్:** http://tsvu.nic.in/

**కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం:** ఈ విశ్వవిద్యాలయం పరిధిలో రెండు ఉద్యాన పాలిటెక్నిక్‌లు దస్నాపూర్, రామగిరి ఖిల్లాల్లో ఉన్నాయి. వీటిలో ఒక్కోదానిలో 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. డిప్లొమా ఇన్ హార్టీకల్చర్ పేరుతో కోర్సు అందిస్తున్నారు. **వెబ్‌సైట్:** http://skltshu.ac.in/

**ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం:** ఈ యూనివర్సిటీ పరిధిలో 10 వ్యవసాయ పాలిటెక్నిక్‌లు, ఒక విత్తన సాంకేతిక, ఒక వ్యవసాయ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 8 ప్రైవేటు పాలిటెక్నిక్‌లు, మూడు వ్యవసాయ ఇంజినీరింగ్, ఒక విత్తన సాంకేతిక పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. ఈ కళాశాలల పరిధిలో మొత్తం 1020 సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయం సీట్ల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించింది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపాలి. చివరి తేదీ 18 జూన్, 2018.

**వెబ్‌సైట్:** www.pjtsau.ac.in



### ఆంధ్రప్రదేశ్‌లో

**శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం:** ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి కేంద్రంగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ ప్రాసెసింగ్ విభాగాల్లో డిప్లొమా కోర్సులను అందిస్తోంది. ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా ఈ యూనివర్సిటీ పరిధిలో 10 పశుసంవర్ధక, ఒక మత్స్యశాస్త్ర పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. వీటిలో 20 మత్స్యశాస్త్రపు సీట్లతో పాటు మరో 210 పాలిటెక్నిక్ సీట్లు ఉన్నాయి. గత ఏడాది నుంచి ఈ పశువైద్య విశ్వవిద్యాలయం ప్రైవేటు రంగంలో పాలిటెక్నిక్‌లను అనుమతించింది. ప్రైవేటులో 3 పశుసంవర్ధక, ఒక మత్స్య, ఒక డెయిరీ ప్రాసెసింగ్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.svvu.edu.in నుంచి దరఖాస్తు విధానం, సీట్లు, కళాశాలలు ఉన్న ప్రాంతాల వివరాలు పొందవచ్చు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. సీట్లనూ ఆన్‌లైన్ విధానంలోనే కేటాయిస్తారు.



**డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం:** పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో నాలుగు ఉద్యాన పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. వాటిలో సీట్లు 145. గత ఏడాది నుంచి ప్రైవేటు ఉద్యాన పాలిటెక్నిక్‌లను అనుమతించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 5 ప్రైవేటు ఉద్యాన పాలిటెక్నిక్‌లలో 200 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. ఉద్యాన విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.drysrhu.edu.in నుంచి వివరాలు పొందవచ్చు. తెలుగు మాధ్యమంలో డిప్లొమా బోధన ఉంటుంది.

**ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం:** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు జిల్లా లాం కేంద్రంగా పనిచేస్తోంది. ఈ విశ్వవిద్యాలయం పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రియ వ్యవసాయం విభాగాల్లో రెండేళ్ల డిప్లొమా కోర్సులను అందిస్తున్నారు. వీటిని తెలుగు మాధ్యమంలో బోధిస్తారు. మూడేళ్ల కాలపరిమితి ఉన్న వ్యవసాయ ఇంజినీరింగ్ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో అందిస్తారు. ఈ విశ్వవిద్యాలయం పరిధిలో 15 వ్యవసాయ పాలిటెక్నిక్‌లు, 53 ప్రైవేటు వ్యవసాయ పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. విత్తన సాంకేతిక పరిజ్ఞానం విభాగంలో విశ్వవిద్యాలయానికి సంబంధించి రెండు పాలిటెక్నిక్, ప్రైవేటులో పది పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. సేంద్రియ వ్యవసాయంలో విశ్వవిద్యాలయం కింద ఒక పాలిటెక్నిక్, ప్రైవేటు యాజమాన్యంలో మూడు ఉన్నాయి. వ్యవసాయ ఇంజినీరింగ్‌లో విశ్వవిద్యాలయం కింద రెండు, ప్రైవేటులో 15 ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ వెలువడింది. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 21 జూన్, 2018. మరిన్ని వివరాల కోసం www.angrau.ac.in వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**హెచ్‌యూఆర్ఎల్, దిల్లీ**

సంస్థ: హిందుస్థాన్ ఉర్వరక్ అండ్ రసాయన్ లిమిటెడ్, దిల్లీ

**పోస్టులు:** అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, చీఫ్ మేనేజర్.

**అర్హత:** సంబంధిత బ్రాంచులు/ సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ బీఎస్సీ (ఇంజినీరింగ్), సీఏ/ సీఎంఏ/ ఎంబీఏ, పీజీ, పీజీ డిప్లొమా, అనుభవం. **ఖాళీలు:** 67

**ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా.

**దరఖాస్తు:** ఆన్‌లైన్

**చివరి తేది:** 18.06.2018

**వెబ్‌సైట్:** http://www.hurl.net.in/

**విద్యుత్ కంపెనీల్లో 47 ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు**

**సంస్థ:** పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, పవర్ సిస్టమ్ ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (పోస్కో).

**పోస్టు:** ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (ఫైనాన్స్)

**ఖాళీలు:** 47 (పవర్‌గ్రిడ్-35, పోస్కో-12)

**అర్హత:** సీఏ/ ఐసీడబ్ల్యూఏ (సీఎంఏ) ఉత్తీర్ణత.

**వయసు:** 28 ఏళ్లు మించకూడదు.

**ఎంపిక:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.

**ఆన్‌లైన్ దరఖాస్తు:** 09.06.2018 నుంచి 30.06.2018 వరకు.

https://www.powergridindia.com/

**అలయన్స్ ఎయిర్‌లో 39 ఖాళీలు**

**సంస్థ:** ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ లిమిటెడ్ (అలయన్స్ ఎయిర్), న్యూదిల్లీ.

**పోస్టులు:** అసిస్టెంట్ ఇంజినీర్, క్రూ కంట్రోలర్ తదితరాలు.

**ఖాళీలు:** 39 **అర్హత, వయసు, అనుభవం:** నిబంధనల ప్రకారం. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరి తేది:** 29.06.2018

**వెబ్‌సైట్:** http://www.airindia.in/careers.htm

### ప్రవేశాలు

**ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామ్**

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

**కోర్సులు:** బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ), బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (ఇంటీరియర్ డిజైన్).

**కాలవ్యవధి:** 4 సంవత్సరాలు

**సీట్ల సంఖ్య:** 270

**అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.

**ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా.

**పరీక్ష తేది:** 2018 జులై 14, 15

**దరఖాస్తు:** ఆన్‌లైన్

**చివరి తేది:** 30.06.2018 (రూ.3000 అపరాధ రుసుముతో 07.07.2018)

**వెబ్‌సైట్:** www.jnafauadmissions.com

మరిన్ని నోటిఫికేషన్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు

## జర్నలిజం చేయాలంటే?

**ఇంటర్ పూర్తిచేశాను. జర్నలిజం చేయాలనుంది. డిగ్రీలో ఏ కోర్సులు ఎంచుకుంటే మేలు? ఈ రంగంలో భవిష్యత్తు ఎలా ఉంటుంది? - *ఎస్. పవన్,*** రైల్వే కోడూరు

**జ:** ఇంటర్ పూర్తిచేయగానే ఏదో ఒక డిగ్రీలో చేరాలని అనుకోకుండా భవిష్యత్తులో చేరాలనుకుంటున్న రంగానికి అనుగుణంగా కోర్సును ఎంచుకోవాలనుకోవడం చాలా మంచి ఆలోచన. జర్నలిజం కోర్సు చేయాలనుకునేవారికి ముందుగా దానిపట్ల ఆసక్తి ఉండటం ప్రధానం. మీరు డిగ్రీలో జర్నలిజం కాంబినేషన్‌లో బీఏ చేస్తే జర్నలిజం పట్ల అవగాహన ఏర్పడుతుంది. సమాజం పట్ల ఆసక్తి, మానవ సంబంధాల పరిశీలన, రాజకీయాలపై అవగాహన, భాష మీద పట్టు, అన్నింటికీ మించి పరిశోధన, విశ్లేషణ శక్తి ఉంటే ఈ రంగంలో రాణించగలుగుతారు. ఈ అంశాలపై అవగాహన రావాలంటే ఇంగ్లిష్, సైకాలజీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ వంటి సబ్జెక్టుల్లో కమ్యూనికేషన్‌ను ఒక సబ్జెక్టుగా చదివే ప్రయత్నం చేయండి. అలా కుదరకపోతే ఏ సామాజిక శాస్త్రాల్లో అయినా డిగ్రీ పొందే ప్రయత్నం చేస్తూ జర్నలిజంను మాత్రం మీకు మీరుగా వివిధ పత్రికలు, పుస్తకాలు, అంతర్జాలం ద్వారా నేర్చుకునే ప్రయత్నం చేయండి.

ఈ రంగంలో భవిష్యత్తు చాలా బాగుంటుంది. డిగ్రీ తరువాత తప్పకుండా జర్నలిజంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసేలా ప్రయత్నించండి. పీజీలో మీరు ఎంచుకున్న రంగాన్నిబట్టి మీకు ఉద్యోగావకాశాలుంటాయి. పత్రిక, టీవీ, ఎన్‌జీఓ, ఆకాశవాణి, ఇంకా వివిధ సంస్థల్లో ప్రజాసంబంధ అధికారులు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో, వివిధ అంతర్జాతీయ సంస్థలు, పరిశోధన రంగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల్లో ఉద్యోగావకాశాలుంటాయి.

ఏ రంగంలోనైనా రాణించాలంటే దానిపై పరిజ్ఞానం, భావప్రకటన సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, పరిశీలన, పరిశోధన, సృజనాత్మక వంటి అంశాల్లో మిమ్మల్ని మీరు మెరుగుపరచుకుంటే అవకాశాలే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి.

*- ప్రొ. బి. రాజశేఖర్,* కెరియర్ కౌన్సెలర్

# To bump into.. అంటే?

MODERN ENGLISH USAGE



ఎం. సురేశన్

**ఎక్కడోచోట అనుకోకుండా కొందరిని కలుస్తుంటాం. దాన్ని అర్థవంతంగా ఇంగ్లిష్‌లో ఎలా చెప్పాలి? దానికో వ్యక్తీకరణ ఉంది. దాన్ని సంభాషణల్లో ఉపయోగించే విధానం గురించి ఉదాహరణల సాయంతో తెలుసుకుందామా?**

**Prasad:** I bumped into Sriram yesterday. He appeared very healthy. He seems to have recovered from his illness (నేను నిన్న శ్రీరామ్‌ను అనుకోకుండా కలుసుకున్నా. వాడు చాలా ఆరోగ్యంగా కనపడ్డాడు. జబ్బు నుంచి బాగా కోలుకున్నట్టు కనిపించాడు).

**Srinivas:** That is good news. I'd like to meet him too. OK, leave that alone. There is a problem that I'd like to discuss with you (అది శుభవార్త. నేను కూడా అతన్ని కలుసుకోవాలనుకుంటున్నా. అది సరే, దాన్ని అటుంచు. నాతో నా సమస్యను ఒకదాన్ని చర్చించాలని కోరుకుంటున్నా).

**Prasad:** Right now I am very busy. We can talk the problem over tomorrow morning. I will certainly call on you (ఇప్పుడు నేను తీరిక లేకుండా ఉన్నా. రేపు పొద్దున దాన్ని చర్చిద్దాం. నేనే రేపు నీ దగ్గరికి వస్తాను).

**Srinivas:** That is very good of you. When I tried to discuss the problem with Sudhakar, he talked back to me. He did not even sympathize with me (అది నీ మంచితనం. నేను దాన్ని సుధాకర్‌తో చర్చించాలనుకుంటే నాతో చాలా అసహనంతో మాట్లాడాడు. నాపట్ల అతను సానుభూతి కూడా చూపలేదు.)

**Prasad:** He is always like that. He is too impatient. But when it is his problem, he makes us sit and find a solution to it (అతనెప్పుడూ అంతే. ఓర్పు మరీ తక్కువ. కానీ అది అతని సమస్య అయినపుడు మాత్రం, మనల్ని కూర్చోబెట్టి దానికి పరిష్కారం చూపించే దాకా వదలడు).

**Srinivas:** There were many occasions when he wanted to find solution with my help. I reminded him of it yesterday, but he was not moved in any way (నా సాయంతో తన సమస్యలు ఎన్నింటికో పరిష్కారం కనుక్కున్నాడు. నిన్న నేనది అతనికి గుర్తుచేశా. కానీ, అతనేమీ చలించలేదు).

**Now look at the following sentences from the conversation above:**



**1) To bump into =** Meet people by chance or accident (అనుకోకుండా ఒకరిని కలుసుకోవడం).

**Nagendra:** I met Sekhar by accident yesterday, after a long time. He has changed a lot and is very tall now. It is years since we saw him, isn't it? (నిన్న శేఖర్‌ను అనుకోకుండా కలుసుకున్నా, చాలాకాలం తరువాత. అతను చాలా మారిపోయాడు. మనం వాడిని చూసి ఏళ్లు గడిచిపోయాయి కదా?)

**Seshagiri:** I bumped into him too, this morning. As you say he has changed a lot. But he is the same old Sekhar. He is quite friendly and warm (నేను కూడా ఇవ్వాళ పొద్దున అతన్ని యాదృచ్ఛికంగా కలుసుకున్నా. నువ్వన్నట్టు అతను చాలా మారిపోయాడు. అయితే అతను మన పాత శేఖర్‌లాగానే ఉన్నాడు. మనతో స్నేహంగా, అభిమానంతో ఉన్నాడు).

**2) Talk a problem over =** discuss a problem and find a solution to it (ఒక సమస్యను చర్చించి దానికి పరిష్కారం కనుక్కోవడం).

**Sitaram:** What you have said to me is a knotty problem. We can't find a solution to it immediately. Let us discuss it tomorrow (నువ్వు నాకు వివరించింది చాలా చిక్కు సమస్య. దానికి మనం వెంటనే పరిష్కారం కనుక్కోలేం. రేపు దాని గురించి చర్చిద్దాం).

**Sri Hari:** That would be fine. I have no work to keep me busy tomorrow. We will talk the problem over tomorrow and find a solution to it. There is always a solution to any problem (అది బాగుంది. రేపు నాకేం పని లేదు, తీరిక లేకుండా చేసేందుకు. ఆ సమస్యను మనం రేపు చర్చించి ఒక పరిష్కారాన్ని కనుక్కుందాం. ప్రతి సమస్యకూ పరిష్కారం అనేది ఉంటుంది).